క్లుప్తంగా

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



శిక్షణార్థులతో నిర్వాహకులు

బొబ్బిలి: స్థానిక వాసు జూనియర్ కళాశాలలో కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. జనవిజ్ఞాన వేదిక, గ్రీన్‌బెల్ట్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం కలిగించే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి, గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



సూచనలిస్తున్న ఎంఈవో త్రినాథరావు

తెర్లాం: పదో తరగతి(టెన్త్) ఫెయిలైన విద్యార్థులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన తరగతులను ఎంఈవో త్రినాథరావు తనిఖీ చేసి, విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించేలా చూడాలని, త్వరలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేలా చదివించాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయుడు జి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

స్టాక్ పాయింట్‌కు చేరిన పాఠ్యపుస్తకాలు



స్టాక్ పాయింట్‌లో భద్రపరిచిన పుస్తకాలు చూపిస్తున్న ఎంఈవోలు త్రినాథరావు, పాపారావు

తెర్లాం: స్థానిక స్టాక్ పాయింట్‌కు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న పాఠ్యపుస్తకాలు ఆదివారం వచ్చాయని ఎంఈవోలు త్రినాథరావు, పాపారావులు తెలిపారు. ఇంకొన్ని పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు అన్ని పుస్తకాలు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విత్తనగుళికల తయారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని సోమరాజుపేటలో విత్తనగుళికల తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణలు విత్తనగుళికల తయారీని ప్రయోగపూర్వకంగా వివరించి, వాటి ప్రయోజనాలు తెలిపారు. అనుములు, కందులు, మినుములు, పెసలు, జొన్నలు, మొక్కజొన్న, సజ్జలు, అలసందలు వంటి పలురకాల విత్తనాలను విత్తనగుళికలుగా తయారు చేసుకుని, నాటుకోవాలని అలా అయితే తెగుళ్లను తట్టుకుని, అధిక దిగుబడులు ఇచ్చే పంట సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.రమేష్‌నాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు



సంతకవిటి: ప్రిస్క్రిప్షన్ రాస్తున్న వైద్యురాలు

సంతకవిటి: స్థానిక శ్రీసత్యసాయి మందిరం వద్ద శ్రీకాకుళానికి చెందిన లైఫ్ రే ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 135 మందికి వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పి.సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో వైద్య పరీక్షలు..

మెంటాడ: విజయనగరంలోని మహారాజా కేంద్ర సర్వజన ఆస్పత్రిలో ఈ నెల 7, 8వ తేదీల్లో అంధులైన సామాజిక పింఛన్‌దారులకు మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.భానుమూర్తి ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. గ్రామాల్లోని అంధులైన పెన్షనర్లు తమకు కేటాయించిన ఆస్పత్రికి వెళ్లి, వైద్య పరీక్షలు చేయించుకుని, ధ్రువీకరణ పత్రం తెచ్చుకోవాలన్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శుల ద్వారా సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు.



రేగిడి: ఉంగరాడలో గాలులధాటికి నేలరాలిన మామిడికాయలు



వంగర: కొండచాకరాపల్లిలో నేలమట్టమైన వరి పంట



ఇరువాడలో ఈదురుగాలులకు నేలకొరిగిన వరిచేను

అకాల వర్షం.. మిగిల్చింది నష్టం!

అకాల వర్షాలు.. రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మామిడికాయలు నేలరాలగా, వరిచేను పూర్తిగా నేలకొరిగింది. అరటితోటలు ధ్వంసమయ్యాయి. దీంతో చేతికి అందివచ్చిన పంట కళ్లముందే పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకో విధంగా వాతావరణం ఉంటుండడంతో మిగతా పంట ఎక్కడ నాశనమవుతుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జరిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

-వంగర/రేగిడి/బాడంగి



బాడంగి: భీమవరంలో పూర్తిగా కింద పడిపోయిన వరిచేను

పుస్తక పఠనంతో అపార జ్ఞానం



తెర్లాం: గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి



బాడంగి గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న డ్రాయింగ్ టీచర్ నారాయణమూర్తి

తెర్లాం: పుస్తక పఠనంతో అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందని, విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ తప్పనిసరిగా ఓ పుస్తకం చదివేలా చూసుకోవాలన్నారు. పుస్తకాలు ఎంతగా చదివితే విజ్ఞానం అంతగా మెరుగుపడుతుందన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని, పుస్తకాలు చదవడంతో పాటు, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

బాడంగి: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనంపై ఆదివారం శిక్షణ ఇచ్చారు. డ్రాయింగ్ టీచర్ నారాయణమూర్తి.. సులభంగా బొమ్మలు ఏ విధంగా గీయాలో నేర్పించారు. అలాగే చక్కని చేతిరాతపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తాం

రాజాం సిటీ: ప్రతి నియోజకవర్గంలో ఎంపీ నిధులతో ఓ డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాజాంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు త్వరలోనే భవనాన్ని పరిశీలిస్తామన్నారు. గ్రంథాలయ పర్యవేక్షణకు ఓ అధికారిని నియమిస్తామని, విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు.

రేషన్‌షాపు ప్రారంభం



రేషన్‌షాపు ప్రారంభిస్తున్న సర్పంచ్ వసుంధర

బొబ్బిలిరూరల్: మండలంలోని కమ్మవలస గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్‌షాపును సర్పంచ్ పిల్లా వసుంధర ఆదివారం ప్రారంభించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని డీలర్‌కు సర్పంచ్ సూచించారు.

సన్మానం



గుంపస్వామి మాస్టారును సత్కరిస్తున్న దృశ్యం

బొబ్బిలి: పాతబొబ్బిలికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మింది గుంపస్వామిని యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ సభ్యులు ఆదివారం బొబ్బిలిలో సన్మానించారు. 90 ఏళ్ల వయసు వచ్చినా తన పనులు తాను చేసుకుంటూ తన బోధనల ద్వారా యువతను సన్మార్గంలో నడిపేందుకు కృషి చేస్తున్నందుకు గాను ఆయనను సత్కరించినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో విజయమోహనరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఊరు దాటి వెళ్లాలంటే..నది దాటాల్సిందే!



ఊరు దాటి వెళ్లాలంటే.. నది దాటాల్సిందేనంటున్నారు.. బాడంగి మండలంలోని గొల్లాది గ్రామస్తులు. విద్యార్థులు కళాశాలకు చేరుకోవాలన్నా.. పెద్దలు పనికి వెళ్లాలన్నా ఇక్కడి వేగావతి నది దాటి వెళ్లాలి. ఇప్పుడు వంతెన లేని కారణంగా మోకాలిలోతు నీటిలో నడిచి వెళ్లాల్సిన దుస్థితి. వర్షాకాలంలో వరదలు వస్తే ఇక అంతే సంగతులు. గొల్లాది–బొబ్బిలి మధ్య పూర్తిగా రాకపోకలు నిలిచిపోతాయి. ఇవే కష్టాలు కొన్నేళ్లుగా పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు వంతెన నిర్మిస్తామని శిలాఫలకం కూడా వేశారని, అయినా నిర్మాణం జరగలేదన్నారు. ఇప్పటికైనా వంతెన కాకపోయినా కనీసం కాజ్‌వే అయినా నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

-బాడంగి

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..!



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ చిత్రంలోని విద్యుత్ స్తంభం కనిపిస్తోంది. బొబ్బిలిలోని ఐటీఐ కాలనీలో బాలికల వసతిగృహం దగ్గరలోని ఓ ఇంట్లో ఇలా విద్యుత్‌స్తంభాన్ని కొన్నాళ్ల క్రితం విద్యుత్ శాఖ అధికారులు వేసేశారు. ఇదేంటని ఆ ఇంటి యజమాని మండల అప్పనరసమ్మ అప్పట్లో ప్రశ్నిస్తే మళ్లీ తీసేస్తామని సమాధానమిచ్చారు. ఏళ్లు గడుస్తున్నా దానిని అక్కడి నుంచి తీయకపోవడంతో స్తంభం ఎప్పుడు తీస్తారని బాధితురాలు తరచూ సంబంధిత అధికారులను అడుగుతోంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పైగా దరఖాస్తు చేసుకుని, డబ్బులు చెల్లిస్తే గానీ మార్చలేమని మెలిక పెడుతున్నారు. వాళ్లే వేసి, తిరిగి డబ్బులు అడగడమేంటని బాధితురాలు ఆశ్చర్యపోతోంది. ఉన్నతాధికారుల దృష్టికి తన సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరుతోంది. ఇదే విషయమై ఏఈ సాంబశివరావును వివరణ కోరగా, డబ్బులు కడితే స్తంభం మార్చేస్తారని తెలిపారు. తాము వేయమని అడగలేదని, అలాంటప్పుడు తాము ఎందుకు డబ్బులు ఇవ్వాలని బాధితురాలు వాపోతోంది.

-బొబ్బిలి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు



బొబ్బిలిరూరల్: పదో తరగతి విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. 1995–1996 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఒక్కచోటకు చేరి ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. అనంతరం ఆర్థికంగా వెనకబడిన తమ స్నేహితులకు తోడ్పాటును అందించేందుకు నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత అప్పట్లో తమకు వి ద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఎల్.సంగంనాయు డు, సత్యం, కృష్ణారావు, శ్యామ్‌సుందర్, జూనియర్ అసిస్టెంట్ అప్పారావులను ఘనంగా సత్కరించారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని పక్కి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1988–89 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా సరదాగా కలుసుకుని ఆనాటి తమ తీపిస్మృతులు నెమరవేసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, స్వామీ వివేకానంద, సరస్వతీదేవి, గౌతమ బుద్ధుని విగ్రహాలు ఆవిష్కరించారు. అనంతరం ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట పైడిరాజు, ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

బొబ్బిలి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జి.భవ్యరెడ్డి హెచ్చరించారు. స్థానిక పట్టణంలోని గొల్లపల్లిలో దాడితల్లి ఉత్సవాలు జరుగుతున్నందున భక్తులకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు ఆదివారం దిశానిర్దేశం చేశారు. ఆకతాయిలు ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిని పట్టుకుని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పండగ చేసుకుని, పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు.

వేసవి దుక్కు..లాభాలు దక్కు!



ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పంట దిగుబడులు రావాలంటే వేసవి దుక్కులే ప్రధానమని, వేసవి దుక్కు బాగా చేస్తేనే నేలసారవంతమై పంటలు బాగా పండుతాయని అన్నదాతలు చెబుతున్నారు. ప్రస్తుతం చాలాచోట్ల రైతులు పొలాల్లో దుక్కి పనులు చేస్తూ భూసారానికి నవధాన్యాలు కూడా జల్లుతున్నారు. దుక్కి ఎంత బాగా చేస్తే భూసారం అంతగా వృద్ధి చెంది పంటకు అవసరమైన పోషకాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో రైతులంతా ఇప్పుడు దుక్కి పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో రేగిడిలో దుక్కి పని చేస్తున్న రైతును చూడొచ్చు.

-రేగిడి

ఘనంగా దాడితల్లి ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారి చెట్టు వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



దేశమ్మతల్లికి భక్తుల పూజలు



దాడితల్లికి పసుపు, కుంకుమ, చీర, గాజులు సమర్పిస్తున్న పురోహితులు

బొబ్బిలి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా పేరొందిన దాడితల్లి ఉత్సవాలు స్థానిక పట్టణంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఉత్సవాలు ముందురోజు దేశమ్మతల్లి వారాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

ఈ నేపథ్యంలో ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న దేశమ్మకు భక్తులు పసుపు, కుంకుమ, చీరలు, కోళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గొల్లపల్లిలో కొలువైన దాడితల్లికి సుప్రభాతసేవ, ప్రత్యేకపూజలు చేసి, ఉత్సవాలను ఆరంభించారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవంతో పండగ ముగుస్తుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పండగకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానుండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దైవదర్శనం సులభంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. డీఎస్పీ జి.భవ్యరెడ్డి, సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్‌ఐ రమేష్‌లు మొత్తం 250 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయించారు. ప్రశాంత వాతావరణంలో పండగ జరిగేలా చూడాలని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఫ్లైఓవర్‌పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిలో పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సంతోష్(బబ్లూ), గున్నతోటవలసకు చెందిన వంశీ ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి.. రాత్రి 10 గంటల సమయంలో ఫ్లైఓవర్ మీదుగా సంతోష్, వంశీలు రెండు వేర్వేరు బైక్‌లపై వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కిందపడ్డారు. దీంతో వారు గాయపడ్డారు. కారు కూడా అదుపు తప్పి బోల్తాపడగా, కారు ఓ వైపు ధ్వంసమైంది. స్థానికులు అప్రమత్తమై క్షతగాత్రులను చికిత్స నిమిత్తం దగ్గరలోని సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)కి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ కె.సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.